# 10



# అంటుకొమ్మ

అక్కిరాజు భట్టిప్రోలు

అంటు కట్టడం అంటే? ఈ చెట్టుకొమ్మని నరికి, కొంతమేర పై చెక్కు తీసి మరో చెట్టు కొమ్మకి అతికించి, పైన మట్టి కప్పి గట్టిగా కట్టెయ్యడం. ఈ కొమ్మ ఇమడగలిగితే ఆ చెట్టుకొమ్మే అయి పూలూ పళ్లూ కాస్తుంది. లేదా మాడి చస్తుంది.

అప్పుడు మరో కొమ్మని తెచ్చి అతికించుకోవచ్చు. విషయమేమంటే, అతుకు కొమ్మకు కాసే పళ్లని కూడా కొత్తచెట్టు పళ్లనే పిలుస్తారు. అదీ తమాషా! అతుకు కొమ్మలు బతికినా చచ్చినా ఒకటే... లెక్కలోకి రావు.

*

నల్లటి రోడ్డు మీద పరిగెడుతోంది క్వాలిస్.

"సంధ్యా! కాస్త వాటర్ బాటిల్ అందుకోవే... మీ నాన్నకి."

మధ్య సీట్లో కూర్చున్న అనసూయమ్మ వెనక సీట్లో ఉన్న కూతుర్ని అడిగారు.

బయటికి చూస్తున్న సంధ్య కాళ్ల దగ్గరున్న బాటిల్ తీసి తల్లికిచ్చింది.

బాటిల్లో నీళ్లు తన దగ్గరున్న డిస్పోజబుల్ గ్లాసులో పోసి భర్త కందించారు అనసూయమ్మ. ఆ మంచినీళ్లు రెండు గుక్కల్లో తాగేసి మళ్లీ ఖాళీగ్లాసు భార్య కందించారు సదాశివరావు. ఆవిడ ఆ గ్లాసుని ముందున్న డ్రైవర్‌కిచ్చి, "కాస్త బయట పడెయ్యి నాయనా," అంది.

ఎ.సి.కారు పుణ్యమా అని అన్ని డోర్లూ బిగదీసుకు కూర్చున్నారేమో, పెద్దావిడకి అద్దం ఎలా దించి గ్లాసు బయట పడేయాలో తెలీదు. తదేక దీక్షతో డ్రైవ్ చేస్తున్న రాముడు ఒక చేతిని స్టీరింగ్ మీదే ఉంచి, అలవోకగా మరో చేత్తో గ్లాసందుకుని, అదే చేత్తో అద్దాన్ని కూడా దింపేసి, గ్లాసు బయట పడేసి మళ్లీ అద్దాన్ని మూసేశాడు. తను మంచినీళ్లు తాగడం అనే కార్యక్రమంలో మొత్తం ముగ్గురు పాలు పంచుకుని అంకిత భావంతో నిర్వర్తించడాన్ని తృప్తిగా గమనించీ, గమనించకుండా అన్నారు సదాశివరావు... "ఈ ఊళ్లెంత మారిపోయాయో..."

"మనం రావట్లేదని ఊళ్లు మారకుండా ఉంటాయేమిటి," అన్నారు అనసూయమ్మ.

ఆవిడ మాట పూర్తవకుండానే అరచినట్టుగా అన్నాడు ముందు సీట్లో కూర్చున్న పన్నెండేళ్ల శశి.

"దీసీజ్ సో ఫన్నీ," అంటూనే తన చేతిలో ఉన్న కాంకార్డర్ని ముందుకు ఫోకస్ చేశాడు. అంత ఆశ్చర్యం కలిగించే విషయమేమిటా అని అందరూ చూశారు.

క్వాలిస్‌కి అడ్డంగా రోడ్డు మీద మేకల దండు. ఆ మందకి అటువైపు ఓ లారీ ఆగి ఉంది. ఈ మధ్యలో ఓ ఆసామి ఆ మేకలన్నింటినీ ఓ వరుసలో అమర్చి ట్రాఫిక్‌ని పంపించే ప్రయత్నంలో ఉన్నాడు. అతి మామూలుగా ఉన్న ఈ సంఘటన శశికి మాత్రం ఆశ్చర్యమే. వెనక సీట్లోంచి సంధ్య అందుకుంది- "రోడ్డు మీద గొడ్డూగోదా అడ్డం రావడం వీడెప్పుడు చూశాడూ..."

అమెరికాలో పెరుగుతున్న తన కొడుకు శశిని మిగతావాళ్లందరికీ అర్థం చేసే ప్రయత్నం చేసింది.

"ఏవిట్రా మీ దేశంలో గొడ్డూగోదా ఉండదేవిరా? ఏం తింటారూ ఏం తాగుతారూ?" తాతగారు మధ్య సీట్లోంచి.

"అక్కడ గొడ్డూగోదా లేకపోవటమేంటి నాన్నా... పాలూ పెరుగూ చీజ్ సుబ్బరంగా తింటారు. పాలూ పెరుగూ మాత్రమేనా... ఆ గొడ్డూగోదానే ఏకంగా తినే స్తారు. కాపోతే అవిలా రోడ్డు మీదకి రావు. పొరపాటున వచ్చినా ఏ ట్రక్కు కిందో పడి పోవాల్సిందే తప్ప, ఇలా తీరిగ్గా తోలుతూ కూచోరు," అంది సంధ్య.

మళ్లీ బయల్దేరింది వాహనం. మొత్తం అందులో ఇద్దరు పిల్లలూ, ఐదుగురు పెద్దవాళ్లూ ఉన్నారు రాముడు కాక. డ్రైవర్ సీటు పక్కన ఇద్దరు పిల్లలు సంధ్య కొడుకు శశి, శంకరం కూతురు భార్గవి కూర్చు న్నారు. మధ్య సీట్లో పెద్ద వాళ్లిద్దరూ అనసూయమ్మ, సదాశివరావుగారు. చివరి సీట్లో ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకోవచ్చని శంకరం, శంకరం భార్య లత, శంకరం చెల్లెలు సంధ్య కూర్చున్నారు.

"అన్నయ్యగారు కూడా వస్తే బాగుండేది," అంది లత, సంధ్యని ఉద్దేశించి.

"వస్తాననే అన్నారు వదినా. బెజవాడలో వాళ్ల ఫ్రెండ్స్ వదల్లేదు. మనతో రావాలో వాళ్లతో వెళ్లాలో తిక మకపడుతుంటే నేనే అన్నా. మనవాళ్లని ఎప్పుడో ఒకప్పుడు కలుస్తూనే ఉంటాం. మీ ఫ్రెండ్స్‌తోనే వెళ్లండి అని," భర్త రాకపోవడాన్ని తన మీదే వేసుకుంది సంధ్య.

"అయినా మనం తిరిగి ఇంటికి చేరేటప్పటికి ఆయన కూడా వచ్చేసే ఉంటార్లే," అని ముక్తాయిం చింది.

ఎంత ఎ.సి కారు అయినా, నిండుగా ఉన్న మనుషులు, వేసవి కాకపోయినా కాస్తున్న బయటి ఎర్రటి ఎండ కలిసి లోపల ఉక్కగానే ఉంది.

"ఏదన్నా కూల్డ్రింక్ తాగుదాం. ఇక్కడ ఏదన్నా చల్లగా దొరుకుతాయేమో చూడు," అన్నది శంకరాన్ని ఉద్దేశించి సంధ్య.

"ఇక్కడేం చల్లగా దొరుకుతాయే. ఏదో ఓ చిన్న ఫ్రిజ్ పెట్టుకుని కూర్చుంటారు. వచ్చీ పోయే కరంటుతో నీకు కావాల్సినంత చల్లగా ఏమీ దొరకవు. ఆ బాటిల్‌లో ఉన్న నీళ్లే నయం," తేల్చి చెప్పాడు శంకరం.

తనలా అంటుండగానే అందరి తలలు అప్రయ త్నంగా కారు బయటికి, రోడ్డు వెంబడి చూట్టం మొదలు పెట్టాయి కూల్డ్రింక్ షాప్‌ల కోసం.

"రెండేళ్లనించీ సరైన వానల్లేవు. కాలవల్లో నీళ్లు రావటం మానేశాయి. నాట్లు కూడా పళ్లేదు ఇంకా. అదంతా పిచ్చిగడ్డి. ఇక్కడే ఇలా ఉంటే మెట్ట ప్రాంతాల పరిస్థితి ఏమిటో. జనాలు పురుగుల మందులు తాగేస్తు న్నారంటే తాగరూ?" వరి పొలాల్లో మొలిచిన పిచ్చిగడ్డిని చూపిస్తూ బయట దృశ్యాన్ని స్వగతంలా వివరించాడు శంకరం.

"మరే! ఏవిట్రా నాయనా ఆ వార్తలు. తెలుగు పేపర్ చదవాలంటేనే భయమేస్తోంది. మొదటి పేజీలో ఆత్మహత్యల స్కోరూ, చివరి పేజీలో క్రికెట్ స్కోరు," విరక్తిగా అంది సంధ్య.

"ఆ రెండు పేజీల మధ్య స్టాక్‌మార్కెట్, హైటెక్‌ల వైభోగం," కసిగా అన్నాడు శంకరం.

"సర్లేరా! నువ్వు మరీ అతి. వానలు పడకపోవ టానికి రైలు లేట్‌గా రావడానికి కూడా హైటెక్కే కారణ మనగల సమర్థుడివి," తేల్చేసింది సంధ్య.

"వాట్స్ దట్ మామ్?" అన్నాచెల్లెళ్ల సంభాషణని తుంచేస్తూ అడిగాడు శశి.

రోడ్డు పక్క నల్లటి కుండల్లోంచి తెల్లటి నురగతో తొంగి చూస్తూ అమ్మకానికి సిద్ధంగా కల్లు. కనీసం కిలో మీటరుకు ఒకచోటన్నా కుండల్లో కల్లు పెట్టుకుని కూర్చున్నారు.

"అదా! కల్లు... ఆ తాటిచెట్లలోంచి వస్తుంది. ఆపైన చూడు చెట్లకి కుండలు కట్టి ఉన్నాయా... అందులోంచి వచ్చిన కల్లుని ఇలా అమ్ముకుంటారు," విడమర్చి మేనల్లుడికి చెప్పాడు శంకరం. అక్కడితో ఆగకుండా...

"అవునే... నీకు ఏదన్నా చల్లగా కావాలన్నావుగా... ఇంతకు మించి చల్లటిది ఈ ప్రాంతంలో దొరకదు. ఓ కుండ కొనమంటావేమిటి," చెల్లెల్తో పరాచికాలాడాడు.

"కొనరా! బెదిరిస్తున్నావా... నువ్వొకటి తాగు, ఆ తర్వాత నేనొకటి తాగుతా," అన్నని కవ్వించింది సంధ్య.

"వాడితో పెట్టుకోకే... కల్లు కొన్నా కొంటాడు. గొడ్లని కాసుకునే వాళ్లతో పెరిగాడు. ఎప్పుడూ వాళ్ల వెంటే, వాళ్లని వెనకేసుకునే వస్తాడు వాడు. బ్రాహ్మణ పుటక పుట్టి చెరువు గట్టున పిట్ట మాంసం తింటుంటే ఈడ్చుకొచ్చాను వీణ్ణి ఓసారి. వాణ్ణే అడుగు," తండ్రి మధ్యలో ప్రవేశిస్తో అన్నాడు.

సంధ్య గతుక్కుమంది. తన భర్తా, కొడుకూ సుబ్బరంగా బీఫ్, పోర్క్ అన్నీ తింటారని తెలిస్తే అను కుంది. తను కూడా కల్లు కాకపోయినా చక్కగా వైన్ తాగగలదని తెలిస్తే వీళ్లెలా రియాక్ట్ అవుతారో...

"పిట్టమాంసమేం ఖర్మా... కల్లు కూడా గొప్పగానే ఉంటుంది. మా క్లాసులో త్రిమూర్తులు గాడుండేవాడు. వాడెప్పుడూ ఏ తాటి చెట్టుకు ఎన్ని కుండలున్నాయో

చూస్తుండేవాడు. వాడికి బలే లెక్క ఉండేది. ఒక్కోసారి వెంటనే కుండని దించకపోతే కుండ నిండి ఒక్కో చుక్కా కింద పడుతుండేది. అది ఆగిఆగి పడుతుంది. వీడు బలే కనిపెట్టేవాడు. చెట్టు కింద నించుని పైకి చూసే వాడు. రెండు నిమిషాలకో చుక్క పడేది. వీడు అరచేత్తో దాన్ని కాచ్ పట్టి నాకేవాడు. కొన్ని రోజులకి మా గాంగ్ అంతా వాడి పక్కన చేరి ప్రతి చుక్కనీ పోటీపడి కాచ్ పట్టేవాళ్లం. ఫ్రెష్ కల్లు ఎంత తియ్యగా ఉంటుందను కున్నావ్,'' చిన్నతనాన్ని గుర్తు చేసుకుంటూ శంకరం.

''నాకు తెలియని వెధవ్వేషాలు ఇంకా ఎన్ని వేశావురా. నేను పోయేదాకా నీ గురించి కొత్త సంగతులు తెలుసుకుంటూనే ఉంటాను,'' పెదవి విరిచేశారు సదాశివరావు.

''ఛీ కల్లు తాగావా డాడీ,'' అంది అంతసేపూ మౌనంగా ఉన్న శంకరం కూతురు భార్గవి.

''పిల్లల ముందు ఇలాటివే మాట్లాడండి,'' మందలించింది లత.

మళ్లీ వెలక్కాయ గొంతులో పడింది సంధ్యకి.

మందు, మాంసం గురించిన విషయాలు పిల్లల ముందు మాట్లాడ్డం కూడా తప్పనుకునే ఈ కుటుంబం లోంచి వచ్చిన తాను ఎంత దూరం ప్రయాణించానా అనుకుంది. అయినా అన్నగానీ, తానుగానీ ఏనాడూ అంత చాదస్తంగా పెరగలేదులే అనుకుని సమాధాన పడింది.

''దాన్ని నాగలి అంటారు. దుక్కి దున్నుతారు దాంతో,'' శశికి చెప్తోంది భార్గవి. రోడ్డు పక్క పొలంలో ఓ నాగలి, జోడెడ్లు, వాటిని అదుపు చేస్తున్న రైతు. అతని చేతిలో ఓ చిన్న ముల్లుకర్ర.

''ఇంకా నాగళ్లు ఉన్నాయా. ఈపాటికి ట్రాక్టర్లు మింగేసి ఉంటాయనుకున్నాను,'' అంది సంధ్య.

''నాగళ్లు ఇంకా ఉన్నాయి కొద్దో గొప్పో. ఎడ్ల బళ్లు మాత్రం చాలా తగ్గిపోయాయే,'' అన్నాడు శంకరం.

''గుర్తుందిరా... చట్రాన్ని పిడకల్లో కాల్చి బండి చక్రానికి బిగించేవాళ్లు. ఎర్రగా కాలిన చట్రం చక్రానికి తగలగానే మంటలు లేచేవి. వడ్లా వాళ్ల పిల్లలు గబగబా బక్కెట్లలో నీళ్లని చెంబుల్తో ఆ చట్రం చుట్టూతా పోస్తూ మంటల్ని ఆర్పేవాళ్లు.''

ఎక్కడో పడి ఉన్న చిన్నప్పటి పల్లె జ్ఞాపకాల్ని తిరగతోడుకుంటూ అంది సంధ్య.

చెల్లెలి వంక చూశాడు శంకరం. ఎడమచేతి మణి కట్టు మీద మచ్చ కనబడింది. సన్నటి అమెరికన్ బ్రాండ్ వాచీ కింద నించి. తన పక్క తొక్కుడు సైకిలు మీంచి కిందపడి, చేతిగాజులు పగిలి గుచ్చుకున్నప్పుడు పడింది ఆ గాటు. ఎక్కడో అమెరికా వెళ్లిపోయిన అమెరికా సంధ్యలోంచి తనకి తెలిసిన చెల్లెల్ని చూసుకున్నాడు.

''ఇంకా ఎంత దూరంరా...'' బయటకు చూస్తూ అడిగింది తల్లి.

''వడ్లమన్నాడు రావటానికి ఇంకో అరగంట. అక్కణ్ణించి ఇంకో పావుగంట గురివిందగుంటకి,'' లెక్కేసి చెప్పాడు శంకరం.

గురివిందగుంట అనసూయమ్మగారి పుట్టినిల్లు. ఆవిడ చిన్నతనమంతా అక్కడే గడిచింది. శంకరం, సంధ్యలక్కూడా అమ్మమ్మగారి ఊరు ఆటవిడుపు చిన్న తనంలో. ఎండాకాలం సెలవుల కోసం ఎదురు చూస్తూ ఉండేవారు అమ్మమ్మ దగ్గరికి పోవటానికి.

విమానం దిగుతూనే అంది సంధ్య, ''ఒరేయ్, ఈసారి ఏమయినా సరే గురివిందగుంట వెళ్లి తీరా ల్సిందే,'' అని.

''అక్కడేం ఉందే. ఊరు ఊరే లేకుండా పోయింది. మనకి సంబంధించి ఏమీలేదు. మనకి సంబంధించిన వాళ్లు కూడా ఎవరూ లేరు,'' శంకరం.

''ఏమున్నా లేకపోయినా ఆ ఊరు వెళ్లా ల్సిందే,''నని తీర్మానించింది సంధ్య.

నిజానికి కావాలనే భర్తని ఈ ప్రోగ్రాం నించి తప్పించింది సంధ్య. ఆ ఊరిని చూసి ఎంతో ఉద్వేగా నికి లోనవుతుంది తల్లి అని ఆమెకు తెలుసు. అల్లుడి ముందు అనవసరపు భేషజాలతో పూర్తిగా ఆ ఆనందాన్ని అనుభవించలేదేమోనని సంధ్య భయం.

''అమ్మగారూ కొత్త ఆంజనేయస్వామి గుడి,'' రాముడు రాబోతున్న గుడిని చూపిస్తూ. చక్కటి రంగు లతో, చుట్టూతా ప్రహరీగోడతో మంచి గుడి.

అప్రయత్నంగా సంధ్య, లతలు కళ్లద్దుకున్నారు.

కొద్దిగా ముందుకెళ్లగా కూలిపోవడానికి సిద్ధంగా ఓ చిన్న బడి. ''మండల ప్రాథమిక పాఠశాల,'' తడువు కుంటూ చదివింది సంధ్య. దాని పక్కనే, 'గ్రామ పంచా యతీ కార్యాలయం,' అదే స్థితిలో.

ఆ ఊరు దాటి కొంచెం దూరం వెళ్లాక

''సంధ్య! చూడవే 100 అడుగుల వినాయకుడి విగ్రహం. కిందటి సంవత్సరమే పెట్టారు,'' రోడ్డు పక్కనే అంతెత్తున ఉన్న బ్రహ్మాండమైన విగ్రహం.

సంధ్య ఈసారి కళ్లకద్దుకోలేదు.

అనుమానంగా చూస్తూ, ''వానల్లేవు, అంతా దరిద్రం అన్నావు కదరా. ఇన్ని కొత్త గుళ్లేమిట్రా,'' అంది.

''దరిద్రం మనిషికి గానీ దేవుడికి కాదుగా,'' వైరాగ్యంగా అన్నాడు శంకరం.

''అమ్మగారూ వచ్చే ఊరు చూడండి. కొంచెం పెద్దదే ఊరు. రెండు సాయిబాబా గుళ్లు అక్కడ. రెండూ ఈ మధ్యనే కట్టారు,'' రాముడు.

'రెండా... రెండూ షిర్డీ సాయిబాబావే?'' అనుమానంగా సంధ్య.

''ఆహా! రెండూ షిర్డీసాయివే... కాపోతే ఒకటి కమ్మ సాయిబాబా, ఒకటి కాపు సాయిబాబా,'' అంటూ విరగబడి నవ్వాడు శంకరం.

''అవున్నాన్నా. బ్రాహ్మల రామాలయం ఏమయింది,'' నవ్వాపుకుంటూ తండ్రిని రెచ్చగొడుతున్నట్టుగా అడిగాడు శంకరం.

విననట్టుగా నటించి తల తిప్పుకున్నాడు తండ్రి.

''భగవంతుడా! నీకే గతి పట్టింది,'' పైపైన చెంపలు వేసుకుంటూ బయటికే అంది సంధ్య.

ఎవరి ఆలోచనల్లోకి వాళ్లు వెళ్లిపోయారు. కొంతసేపు మౌనంగా గడిచింది, 'వడ్లమన్నాడు వచ్చేశాం,' అని రాముడు డిక్లేర్ చేసిందాకా.

''ఇక్కడ అర్ధరాత్రుళ్లు దిగేవాళ్లం. వానల్లో అయితే మోకాల్లోతు బురదలో పోవాల్సిందే. చచ్చేవాళ్లం,'' అందరికీ తెలిసిన సంగతే చెపుతున్నారు అనసూయమ్మ. ఆ గొంతులో కొత్తగా వచ్చిన ఉత్సాహాన్ని అందరూ గమనించారు. బహుశా ఇక్కణ్ణించే ఆవిడ జ్ఞాపకాలు ప్రారంభమవుతాయి కావును.

వ్యాన్ మెయిన్ రోడ్డు విడిచి గురివిందగుంట దారి పట్టింది. అది కూడా తారురోడ్డే. చిన్నదిగా, గుంతలతో ఉంది.

''ఇక్కడ మా చంద్రం బాబాయి తల పగలగొట్టారు. కాలవల దగ్గర గొడవ. బతుకుతాడనుకోలా.''

''మా మావయ్యగారి రెండో అమ్మాయిని ఈ ఊరే ఇచ్చారు. ఇప్పుడేమైపోయారో.''

''ఇక్కడో మూగాడుండేవాడు. వాడికి అప్పుడప్పుడూ పిచ్చ కూడా పడుతుండేది. మగవాళ్లూ, పెద్దవాళ్లూ కూడా భయపడేవాళ్లు రాత్రుళ్లు ఒంటరిగా రావటానికి ఈ దార్లో. వాడి పిచ్చ ముదిరినప్పుడల్లా.''

''ఇక్కడో డాబా ఉండాలి. అప్పట్లో అదొక్కటే ఇక్కడ, కోమట్లది.''

గుర్తొచ్చినవి గుర్తొచ్చినట్లుగా ఆవిడ చెప్తూనే వుంది. అవన్నీ ఏదో చరిత్రలో కెక్కాల్సిన సంఘటనల్లా చెప్తున్న ఆవిడని ఎవరూ వారించలేదు. ఆశ్చర్యంగా అవన్నీ అందరికీ ఆసక్తికరంగా ఉన్నాయి.

అలా సాగుతుండగానే గురివిందగుంట వచ్చేసింది. పక్కగా చెట్టుకింద తీసి ఆపేశాడు రాముడు. మెల్లగా అందరూ దిగారు.

తన చిన్న పర్సు తీసుకుని దిగారు అనసూయమ్మ. తన ఊరు. తాను చిన్నపిల్లలా పరుగులెట్టి అల్లరి చేసిన ఊరు. ఆయాసంతో నడవలేనేమోనని భయంతో ఇన్‌హేలర్‌ని చిన్న పర్సులో పెట్టుకుని దిగింది.

''ఏవిట్రా ఇదేనా మన వీధి. ఇళ్లే లేవేమిట్రా,'' శంకరాన్ని ఉద్దేశించి.

''ఇక్కడెవరూ ఉండట్లేదుటమ్మా. ఉన్న కొంత మంది కూడా వడ్లమన్నాడు వైపుకు కదిలారు. ఎందుకో తెలీదు,'' జవాబిచ్చాడు శంకరం.

నడుస్తున్న అనసూయమ్మ ఆగిపోయారు.

''ఇదే, ఇక్కడే మన ఇల్లు ఉండేది. మట్టి ఇల్లు. పెద్ద వసారా. గుర్తుపట్టలేకపోయాను ఒక్క నిమిషం,'' ఓ గొడ్లసావిడి చూపిస్తూ అంది.

''శశీ మీ అమ్మ పుట్టింది ఇక్కడే,'' గొడ్ల సావిణ్ణి చూపిస్తూ చెప్పాడు శంకరం.

''తనెక్కడ పుట్టాడో అడగరా మావయ్యని,'' తిప్పికొట్టింది సంధ్య.

శశి ఇద్దరి మాటలు వినకుండా శ్రద్ధగా కాంకార్డర్లో అన్నీ రికార్డ్ చేసుకుంటున్నాడు.

''ఎదురుగా మా పెదనాన్నగారి పెంకుటిల్లు వుండాలి. వాళ్లూ మేమూ ఇక్కడ నడివీధిలో నులక మంచాలు వేసుకుని పడుకునేవాళ్లం ఆరుబయట,'' సగం కూలిన ప్రహరీగోడని చూపిస్తూ అనసూయమ్మగారు.

ఈలోగా ఆగిన వాన్‌నీ పట్నం మనుషులనీ చూసి కొందరు ఊళ్లో వాళ్లు చేరారు. ఎవరూ ఏమిటీ అని ఆరా తీశారు. అందులో ఒకరిద్దరు పెద్దవాళ్లు అనసూయమ్మ గారిని గుర్తుపట్టారు. లేదా గుర్తించారు ఎవరి తాలూకానో.

అర నిమిషంలో వాళ్లమధ్య కల్సిపోయారు అనసూయమ్మ. ఎక్కడెక్కడివో పేర్లు. వాళ్లెక్కడా, వీళ్లెక్కడా, అయ్యో ఆయన పోయారా, ఈవిడది ఇప్పుడు ఏ ఊరూ... మాటలు సాగిపోతున్నాయి.

''ఎందుకులేమ్మా... ఈ ఊరే కాదు... చుట్టుపక్కల చాలా దూరందాకా బ్రాహ్మణ కుటుంబాల్ని వెతికి పట్టుకోవాల్సిందే. ఈ ఊళ్లో అయితే ఒక్కటీ మిగల్లేదు,'' ఓ పెద్దావిడ చెప్తోంది.

''అందరికంటే ముందు ఈ ఊళ్లని వదిలేసింది బ్రాహ్మలే,'' ఓ పెద్దాయన. అది నిందో, మరోటో తెలీ లేదు శంకరానికి.

వ్యవసాయమూ, వృత్తులూ పోయి పల్లెలు వదిలేసి బతుకుతెరువు కోసం పట్టణానికి పోవటం సరే, జరుగుతున్నదే. బ్రాహ్మలు నగరాలకు ఎందుకు వెళ్లాల్సి వచ్చింది? కరణీకాలు పోకముందు, పౌరోహిత్యాలు దొరుకుతున్నప్పుడే ఎందుకు వెళ్లిపోయారు? 'పల్లెల్లో బ్రాహ్మలు కూడా వ్యవసాయాలు చేశారు,' అంటాడు తండ్రి. ఆ వ్యవసాయాన్ని కూడా ముందే వదిలేసింది బ్రాహ్మలే అని ఇక్కడి పెద్దాయన అభియోగం.

''అవసరాలు అవకాశాలూ రెండూ తరిమే శాయిరా మనుషుల్ని పల్లెల్నించి. బ్రాహ్మలెప్పుడూ చదువుల వెంటే పరిగెట్టారు. వ్యవసాయం నించీ, కుల వృత్తి నించీ కూడా గవర్నమెంటు ఉద్యోగాలు వెతుక్కుంటూ పరిగెట్టారు. అలా అవకాశాల్ని వెతుక్కుంటూ వెళ్లిన మొదటివాళ్లు బ్రాహ్మలు. ఇవ్వాళ కరువుతో కడుపు పట్టుకు పరిగెడుతున్న వాళ్లు రెండో రకం,'' పెద్దగా చదువుకోకపోయినా తల్లి చెప్పిన సాంఘిక శాస్త్రం గుర్తుకు వచ్చింది శంకరానికి.

''చెరువు దగ్గరికి నడుద్దాం,'' పక్కనే ఉన్న చెరువు వైపు అడుగులు వేస్తూ అనసూయమ్మగారు.

రెండడుగులేస్తే ఆయాసంతో ఇబ్బందిపడే పెద్దావిడకి ఇంత శక్తి ఎక్కణ్ణించి వచ్చిందా అని ఆశ్చర్య పడుతూ అనుసరించారు అందరూ.

పెద్ద మురిగ్గుంటలా ఉంది చెరువు.

''శశీ ఇక్కణ్ణించే బంకమన్ను తీసి బొమ్మలూ, గురుగులూ చేసేవాళ్లం,'' చిన్నపిల్లలా అరిచింది సంధ్య.

''యు మీన్ ఫ్రం దిస్ అగ్లీ లేక్,'' మొహం అసహ్యంగా పెట్టి శశి.

''అప్పుడు బానే ఉండేదిరా. ఈ నీళ్లే తాగేవాళ్లం. చెరువులో స్నానాలూ అవీ చేసేవాళ్లం కాదు. జాగ్రత్తగా చూసుకునేవాళ్లం చెరువుని. మా అమ్మ మడి కట్టుకుని, ఆ తడి గుడ్డలతోనే బిందెలతో తాగడానికి నీళ్లు తెచ్చేది. పాలేళ్లు కావిళ్లతో మామూలు అవసరాలకి నీళ్లు తెచ్చే వాళ్లు ఇక్కణ్ణించే. గేదెలు ఈనితే జున్నుపాలు బోలెడు మిగిలిపోయేవి... తిన్నంత తినగా తెల్లవారుఝామున బిందెతో ఆ పాలన్నీ తీసుకెళ్లి చెరవులో కలిపేసేది మా అమ్మ,'' అనసూయమ్మగారి జ్ఞాపకాల వరద ప్రవహిస్తూనే ఉంది.

''అయ్యో వేరే వాళ్లకి ఇవ్వచ్చుకదే,'' నొచ్చుకుంటూ అంది సంధ్య.

''ఆ రోజుల్లో ఎవరింట్లో పాడి లేదు? అదీగాక అన్ని జున్నుపాలు చూస్తే గేదెలకి దిష్టి తగులుతుందని భయం కూడా... ఏదో పిచ్చ,'' అనసూయమ్మగారు.

''అమ్మా ఇక్కడ గుడి ఉండాలి కదే,'' సంధ్య, తనకి గుర్తున్న వైపు చూస్తూ.

''అటే, పద,'' అంటూ నడిచింది తల్లి.

పాడుబడి, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఓ చిన్న గుడి. ముందు ఊడ్చి చిన్న ముగ్గేసి ఉంది. లోపలికి తొంగిచూసి ఎవరో దీపం పెడుతున్న ఆనవాళ్లున్నాయని నిర్ధారణ చేసుకున్నారు అనసూయమ్మ.

పక్కూరినించి వారానికోసారి పూజారి వచ్చి దీపం పెడతాట్ట. గుడిపక్కన ఇంటావిడ రోజూ వాళ్ల గుమ్మంతో పాటు గుడి ముందు కూడా ఊడుస్తుందట.

''ఇదెంత పాత గుడో తెలుసా? 150 ఏళ్లకి పై మాటే. స్వాతంత్ర్యానికి ముందు బందరు నించి కాంగ్రెసాయన ఒకరు ఏవో కరపత్రాలు తీసుకుని అన్ని పల్లెలూ కాలి నడకన తిరిగి పంచేవాడు. ఆయన ఈ గుడి ముందే నుంచుని గట్టిగా చదవడం నాకింకా గుర్తే. ఇలాంటి చరిత్ర ఉన్న గుళ్లన్నీ ఇట్లా పాడుబడిపోతుంటే... కొత్తకొత్త గుళ్లు కావాల్సి వచ్చాయి ఒక్కొక్కడికి. అయోధ్య పరిగెడతార్ట గుడి కట్టడానికి. దౌర్భాగ్యపు తరంరా మీది,'' అక్కసుగా అన్నారు అనసూయమ్మ.

''నీకు తెలిసిన రాజకీయాలు ఆపవే,'' సదాశివరావుగారు తన సహజ ధోరణిలో భార్య ప్రవాహానికి అడ్డుకట్ట వేశాడు.

''మనమిక్కడ ఉండనే ఉండము. ఇక్కడ వాళ్లు ఎలా ఉండాలో మనమెలా చెప్తామే? ఏం హైదరాబాదు మాత్రం అలాగే ఉందా? ఒకప్పుడు హైదరాబాదు అని ఒక్క బొమ్మలో చెప్పాలంటే అందమైన చార్మినార్ బొమ్మని వేసి చూపించేవాళ్లు. ఇప్పుడు హైటెక్ సిటీ బొమ్మ చార్మినార్‌ని చెరిపేసింది,'' రెంటికీ సంబంధం ఉందో లేదోగానీ, తనకి తోచింది చెప్పాడు శంకరం.

''సరే ఇహ బయల్దేరదామా?'' సదాశివరావుగారు వాచీ చూసుకుంటూ అన్నారు.

ఆయన మాట ఓ ఆజ్ఞలా అందరూ తిరిగి వాన్ వైపు బయలుదేరారు. వాన్ ఎక్కాక అన్నారు అనసూయమ్మ.

''ఒక్కసారి పుల్లపాడులో ఆగుదాంరా... పెద్దగా రాకపోకలు లేకపోయినా, మా బాబాయి వరసయే

కుటుంబం ఒకటి ఉంది అక్కడ. ఆ బాబాయి మనవల్లో ఒకడింకా అక్కడే ఉన్నాట్ట. వాళ్ల ఇంటి పేరూ మా ఇంటి పేరూ ఒకటేట. వాళ్లింట్లో మా కుటుంబానిది వంశవృక్షం కూడా ఉందిట,'' ఎప్పుడు, ఎక్కణ్ణించి ఈ విషయాన్ని సేకరించిందో తెలీదు.

''అదేనా ఇంకా ఏమన్నా ప్రోగ్రాములున్నాయా? ముందే చెప్పు, సరిగ్గా ప్లాన్ చేసుకుందాం,'' నవ్వుతూ అన్నాడు శంకరం.

వాన్ మళ్లీ దారి పట్టింది. అరగంటలో పది కిలో మీటర్ల దూరంలో ఉన్న పుల్లపాడు చేరింది వ్యాన్. శంకరం దిగి వాకబు చేశాడు. ఇంటి పేరు చెప్పి బ్రాహ్మల ఇల్లు అని అడిగిన వెంటనే వచ్చింది సమాధానం. అయిదు నిమిషాల్లో వాన్ ఓ పాత మట్టి ఇంటి ముందు ఆగింది. అందరూ దిగారు. పెద్దమనిషిలా సదాశివరావుగారు ముందుగా ఇంట్లోకి నడిచి పరిచయం చేసుకున్నారు. ఇంట్లో వాళ్లు హడావుడిగా మంచాలూ, కుర్చీలు వాల్చి వచ్చినవాళ్లని కూర్చోబెట్టారు.

మొత్తానికి అనసూయమ్మగారి బాబాయి వరస పెద్దాయన పోగా, ఆయన మనవల్లో ఒకడైన విశ్వం ఆ ఇంటినే అంటి పెట్టుకుని ఉన్నాడని తెలిసింది. వాళ్ల అమ్మానాన్న కూడా హైదరాబాదులో వాళ్ల అన్నయ్య దగ్గర ఉన్నార్ట.

''మీ నాన్న తాత, మా తాత అన్నదమ్ముల వరస. మరీ దూరపు చుట్టరికమేం కాదు,'' అనసూయమ్మ చెప్తున్నారు.

మర్యాదలూ అవీ అయ్యాక మొత్తానికి ఇద్దరికీ తెలిసిన బంధువుల పేర్లూ ఊర్లూ కబుర్లూ దొరికించుకున్నారు. ఆ సంభాషణని తుంచలేకా, పాలుపంచుకోలేకా ఇబ్బంది పడ్డారు శంకరం, సంధ్య, లతలు.

''మీ దగ్గర వంశవృక్షం ఉందిట కదా... మీరు మాట్లాడుతూ ఉంటే మేం ఓసారి చూస్తాం,'' శంకరం మర్యాదగా అడిగాడు.

''అవునవును... ఆ సంగతి మర్చేపోయాను,'' అనసూయమ్మగారు.

లోపలున్న భార్యని పిలిచి వంశవృక్షం తెప్పించాడు విశ్వం. ఓ పెద్ద కాగితాన్ని చుట్టలా చుట్టి వుంచారు. దాన్ని జాగ్రత్తగా విప్పదీసి చూపించారు. అది కంప్యూటర్లోంచి ప్రింట్ చేసిందని తెలుస్తోంది. ప్రింట్‌లో ఇంగ్లీషులో ఉన్న పేర్ల కింద బ్రాకెట్లో తెలుగులో మళ్లీ రాసి ఉన్నాయి పెన్సిల్తో.

''మా అన్నయ్య కొడుకు అమెరికాలో ఉన్నాడు. వాడే ఇవన్నీ కంప్యూటర్లోకి ఎక్కించాడు. పెద్దవాళ్లంతా చదవలేకపోతున్నారని తెలుగులో నేనే రాశాను,'' వివరించాడు విశ్వం.

సదాశివరావుగారు, అనసూయమ్మగారు శ్రద్ధగా చూట్టం మొదలెట్టారు. విశ్వంగారు ఆయనకి తెలిసిన కుటుంబం గురించి చెపుతున్నారు.

''...ఇదిగో ఇదో పెద్ద కుదురు మళ్లీ. ఈయన ఆ రోజుల్లోనే లండన్ వెళ్లి వచ్చాట్ట.''

''వీళ్ల పిల్లల్లో ఒకాయన వైజాగ్ షిప్యార్డ్‌లో వున్నాట్ట.''

సంభాషణ సాగిపోతోంది.

అనసూయమ్మ తన తండ్రి పేరు వెతికి పట్టుకున్నారు. తన తండ్రి పేరు, తాత పేరు చూసి అలా పైకి మరో నాలుగుతరాల దాకా ఉన్న బంధాల్ని చూసుకుంది.

ఓ పేరు పక్కనే ఈ.గి.క. అని బ్రాకెట్లో పెట్టి ఉంది. ఆ కొమ్మ అక్కడితో ఆగిపోయి ఉంది.

''ఈ.గి.క. అంటే ఏమిటి,'' అడిగాడు శంకరం.

''డైడ్ వితౌట్ మారేజ్... పెళ్లి కాకుండానే చనిపోయారు అని అర్థం,'' వివరించాడు విశ్వం.

ఆ మాట వినగానే ఆసక్తిగా మరోసారి చూశారు అనసూయమ్మ.

''ఊ.క.ఇ. అంటే?'' ఈసారి అనసూయమ్మగారు.

''నో మేల్ చైల్డ్... మగపిల్లలు లేరు అని అర్థం,'' విశ్వం.

శంకరానికి అర్థమయ్యింది. వంశవృక్షంలోకి తొంగిచూశాడు. అనసూయమ్మగారి చెయ్యి ఆవిడ తండ్రి పేరు మీద కదులుతోంది. ఆ పేరు పక్కన ఊ.క.ఇ. అని బ్రాకెట్లో ఉంది. ఆవిడ తండ్రి పేరుతో కొమ్మ ఆగిపోయింది. మిగతా కొమ్మలు శాఖోపశాఖలుగా విస్తరించి ఉంటే, ఇది బోడిగా విరిగిపోయి ఉంది తన తండ్రి పేరు దగ్గర. పిల్లల్లేకపోయినా, పిల్లల్లేకుండానే పోయినా, మగపిల్లల్లేకపోయినా కొమ్మ ముందుకు పోదు!

అతడికి అంటుకొమ్మలు గుర్తొచ్చాయి. ఈ చెట్టు కొమ్మని నరికి, కొంతమేర పైచెక్కు తీసి మరో చెట్టు కొమ్మకి అతికించి, పైన మట్టి కప్పి గట్టిగా కట్టేసేవాళ్లు. ఈ కొమ్మ ఇమడగలిగితే ఆ చెట్టు కొమ్మే అయి పూలూ పళ్లూ కాస్తుంది. లేదా మాడి చస్తుంది. అప్పుడు మరో కొమ్మని తెచ్చి అతికించేవాళ్లు. విషయమేమంటే,

అతుకు కొమ్మకు కాసే పళ్లని కూడా కొత్త చెట్టు పళ్లనే పిలిచేవాళ్లు. అదీ తమాషా! అతుకు కొమ్మలు బతికినా చచ్చినా ఒకటే... లెక్కలోకి రావు.

"నలుగురం అక్కా చెల్లెళ్లం. ఒక్కళ్లమైనా మగ పిల్లాడిగా పుట్టలేకపోయాం," అనేశారు అనసూయమ్మ.

"వై?" అడిగాడు శశి.

అందరూ ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూసుకున్నారు. సమాధానం ఎవరు చెప్పాలా, ఏం చెప్పాలా అని.

"రోలంటే ఇదేరా," శశికి చూపిస్తూ చెప్పింది సంధ్య, వాతావరణాన్ని తేలిక చేయటానికి, సంభాషణ మార్చడానికి.

మరో అరగంట తర్వాత అందరూ లేచారు.

"నువ్వు మా ఆడపడుచువమ్మా," అంటూ జాకెట్‌గుడ్డ పెట్టి బొట్టు పెట్టారు పెద్దావిడకి. ఆడవాళ్లందరూ బొట్లు పెట్టించుకుని సెలవు తీసుకున్నారు.

"ఆ వంశవృక్షం కాపీ ఒకటిస్తారూ... తర్వాత పంపించినా సరే," అడిగాడు శంకరం.

"నా దగ్గర ఇంకా రెండు కాపీలు ఉన్నాయిలెండి. ఫ్లాపీలో కూడా ఉంది. హైదరాబాదులో ఎన్ని కావాలన్నా ప్రింట్ తీసుకోవచ్చు," అంటూ అప్పటిదాకా చూసిన వంశవృక్షాన్ని చుట్టచుట్టి శంకరానికి ఇచ్చేశాడు విశ్వం.

"కెన్ యూ మేక్ మి ఎ కాపీ ఆఫ్ దట్," తనకో కాపీ విడిగా కావాలని అడిగాడు శంకరాన్ని శశి.

"నువ్వేం చేసుకుంటావురా దీన్ని. సరే బెజవాడలో జిరాక్స్ తీయించి ఇస్తాలే," హామీ ఇచ్చాడు శంకరం.

అంతా మళ్లీ వ్యాన్ ఎక్కారు. ఏదో అనబోయిన సదాశివరావుగారు భార్య ముఖం చూసి ఆగిపోయారు...

వ్యాన్ విజయవాడ వైపు పరుగుతీసింది... కొత్తగా ఎక్కిన పాత జ్ఞాపకాల బరువుని కూడా మోస్తూ!

*

"శశీ! పొద్దున్నే ఏం చేస్తున్నావురా... స్నానం చెయ్యి... దుర్గ గుడి కెళ్దామని చెప్పానా," అమెరికా నించి దిగినప్పటి నుంచీ మళ్లీ విమానం ఎక్కేదాకా ప్రతి రోజునీ జాగ్రత్తగా ప్లాన్ చేసిన సంధ్య ఏది పూర్తి చెయ్యలేకపోతానో అని ఆత్రంగా ఉంది.

"హాంగ్ ఆన్ మామ్... జస్ట్ ఎ సెకండ్," తన పనిలోంచి తలెత్తకుండానే శశి.

ఏమి చేస్తున్నాడా అని తొంగి చూసింది సంధ్య. శంకరం ఇచ్చిన వంశవృక్షాన్ని ముందేసుకుని రంగు రంగు స్కెచ్‌పెన్లతో కూర్చుని ఉన్నాడు.

అనసూయమ్మగారి తండ్రి నించి నాలుగు నీలం గీతలు కిందికి గీసి అమ్మమ్మని అడిగి తెలుసుకున్న ఆవిడ అక్కాచెల్లెళ్ల పేర్లు రాసేసి, మళ్లీ అనసూయమ్మగారి నించి ఓ ఎర్రగీత గీసి శంకరం అనీ, నీలం గీత గీసి సంధ్య అనీ రాశాడు. మళ్లీ ఓ ఎర్ర గీత సంధ్యనించీ... ఓ నీలం గీత శంకరం నించీ...

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 31 అక్టోబర్ 2004*

